## లోహమా - వ్యామోహమా ?

అంత గబగబా నెత్తిమీద బరువెట్టుకుని కూలివాడు నాముందు నడవడం నేనిదివరకెప్పుడూ చూచింది లేదు. "సందెలడ్డాది! అసలీపని ఈ పొద్దప్పుడొప్పుకో వలసిందికాదురా!" అంటూ అంగ ఆమడలా ఆలివేస్తూవుంటే, మగడు "మందుకెల్లడం కూడా మానేసుకోవలసివచ్చేలాగుందీ పురమాయింపుమూలకంగా! ధర్మాసుపటాల్ తలుపు లేస్తారనుకుంటాను. మరి అయ్యగారింట ఈ మూటడేసి నేను పోయేసరికి." అని అడుగో మైలున్నరగా నడిచేస్తున్నాడు.

"ఏమిరా? ఆడది అది నీకంటె గబగబా నడుస్తూవుందే?" అని అడిగాను. అడిగినపాళంగా వెనుదిరిగి నావంక చూస్తూ, "నాకు, బాబా! ఇక్కడకు మూన్నెల్లకాణ్ణుంచి నీలిజెరమట్టుకు దిగనారిపోతున్నాను. దమ్మాసుపటాల్ కొయినాపొట్లాలు రోజా తెచ్చుకేసుకున్నా వొదలడంలేదు. కూటికి టికాణా లేక యిల్లా బరువులెత్తుకోవలసివస్తూవుంది, అదీ నేనూ కూడాను." అంటూ ముందువెళ్ళే మగనాలివంక చూచేడు. దానిజుత్తుముడి బుల బులాగ్గా వలంగా వుంది. మల్లెకూ మందారానికీ కూడా ఆశ్రయ మిచ్చే లాగౌపించింది. "కుసింత అగి సూసుకో, కొప్పిడిపోతూ వుంది" అన్నాడువాడు. అది, "విడ్డానికి పువ్వులుంటేగా! బేగినడువు. నడవలేక ఏదో యూసులాడుతావు! బాబులేమైనా అనుకుంటారన్న బీతులేదు నీతిలేదు నీకు!" అంది. ముఖం ఇటు త్రిప్పింది. బరువు అలా నప్పిస్తూనే వుంది వణ్ణెత్తుమీద. ముఖమంతా చెమట. చెమటంతా సిందూరవర్ణ. "నీ బొట్టు

కుంకుమంతా కరిగి కారిపోతూవుందే? ఓ నిముసమక్కడ ఆ మూట పడేసి కూకుని తుడిచేసుకోలే! నవ్వేరు బాటంటవున్న మారాజులందరూను నీ యేసంచూచి." అన్నాడు మగడు ఆలిని చేరుకుంటూ.

దిమ్మన పడేసింది నెత్తిమీదిమూట నేలమీద ఆ కూలీ ఆడది. వీడు ఈ కూలీమగవాడు దానిమూటమీద తన మూట కూడా దించుకుని "ఇస్సు! బాబులూ తవరు ముందునడుస్తూ వుండండి. మేం మీ మడమలుచ్చుకుని ఇప్పుడే వత్తుండాం, రచ్చించుండి," అన్నాడు.

నా కేం చేయడానికీ తోచలేదు. వాళ్ళు ఎత్తుకున్న రెండు మూటలూ రేషన్ దుకాణంనుండి కొలిపించుకు ఇంటికి పట్టించుకు వెడుతూవున్న బియ్యంమూటలు. వెంటనే ఇంటివి చేరుకుంటేనే గాని నా యిల్లాలు వంటే ప్రారంభించదు. వాణ్ణి చూడొస్తే యిద్దరూ ఇలా మూటలు దారిలో పడేసుకూర్చున్నారు. రేషన్ దుకాణాదారు డసలు బియ్యం కొలిచేటప్పుడే "పంతులు గారూ! ఈ పొద్దు మీరిచ్చే కూలీ దంపతీతాంబూళప్పద్దు. ఎలా కనిపెట్టి ఇస్తారో వీళ్ళకు" అని. నేనున్నూ ఆ వాక్యంలోని పరసం గ్రహిస్తూ "ఏముంది. ఒకబేడ ఇద్దరికీ చెరో అణాగా పంచియిచ్చేస్తా" అన్నాను చిరునవ్వు నవ్వుతూ. జేబులో చూచు కుంటే ఒక బేడకాసే వుందిరొక్కం. దాన్ని వెంటనే రెండు అణాకాసులుగా ఆ కొట్టుమీదనే మార్చివేశాను.

"నా సేతిలో బేడొడెత్తే నాను దానికివ్వననే అణా మీవూహ?" అంది ఆడకూలీ. ఇద్దరూకూడా మూటలమీద అలా అనుకుని వుండిపోయేరు. నేను "ముందు మూటలెత్తుకు

పదండి—ఇద్దరికీ చెరో అణా కాదు. చెరోబేడ ఇస్తాను—ఇంటి వద్ద పావలాకాసు వుంది" అన్నాను చిరునవ్వు నవ్వుతూ. మరి నా మాటలోని స్వారస్యం వాళ్ళకక్కర్లేకపోయింది. గబగబా మూటలెగమోసుకుని ఎత్తుకున్నారు ఎప్పట్లాగు. "ఖామందులు మంచోరు. కష్టసుఖాలు కనిపెడతారు" అన్నాడు మగకూలి. ఆడది "వెయ్యి! అడుగెయ్యి" అని హెచ్చరించింది.

నేనెప్పట్లాగే వాళ్ళ వెనకాతలే బయలుదేరాను. కాని బయలుదేరే ముందు వాళ్ల క్రింద పడేసిన మూటల నేలవంక చూచాను. బియ్యం పొలికాయి అనీకాదు. బస్తా చిరిగింది అనీ కాదు—రోడ్డవారనున్న యిసుక సందెలదేముందు ఆదో డాలు చూపిస్తే, నేలంక చూచాను. నాకో వుంగరం దొరికింది ఆ యిసుకలో. బంగారపుది కాదు. ఏదో లోహపుటుంగరంగా కాపడింది. "ఇంటికి వెళ్ళడంతోనే వీళ్ళకు కూలీతోపాటు వుంగరం బహూకరించాలి!" అని తీర్మానించుకున్నాను. గుప్పిట జాగ్రత్త పెట్టాను.

ముగ్గురం మా యిల్లు చేరుకున్నాం. కూలీదంపతులు చెరో మూట యింట్లో పడేసి కూలీ తీసుకోబోతూ నా చేతిలో పావులా కాసు చూచారు—"బాబు లెవరిచేతిలో పడేస్తారో చూస్తాను" అంది ఆడకూలీ. ఇద్దరూ చేతులు చాపేవున్నారు. నేను పావులా కాసు మగవాడిచేతిలో పడేస్తూ "దానికి బేడ నీవు ఇవ్వనక్కర లేదు. ఈ వుంగరం బహూకరించు" అని నాకుదొరికిన బేవారసు వుంగరం వాని చేతిలో పావులాకాసుమీద మోగేలా పడేశాను.

కూలివాడు చకితుడైనాడు. కూలీది ఆశ్చర్యపోసాగింది. ఇద్దరూ ఐక్యకంఠంగా "ఉంగరం మాదేనండి" అని అరచారు. "మూటలు క్రిందడేసేటప్పుడు నావేలిని జంకి తూలిపడిపోయింది

కామోసురా ! కానలేక పోయినాం !'' అంది పెండ్లాం. పెనిమిటి "నాకు జబ్బుపడి సిక్కిపోతే, దీనివేల్పుంచుకోమని ఇచ్చాను. ఇదీ వూడేసింది కామోసు ఎక్కడో ? '' అన్నాడు. "ఎక్కడో ఏంటి ? అక్కడేరా ! దిమ్మన పడేసినప్పుడు గాజులచప్పుడు సందణ్ణి రింగు ఠంగు వినబడలేదు మనకు '' అంది.

నేను "ఆ వుంగరం మీదేనని ఏమిటి ఆనవాలు ? మీ ఇరువురిలో ఎవరి ఏ వేలికి సరిపోయినా తీసుకుపోవచ్చును. లేకుంటే బహుమానం గాదుగదా అబద్ధమాడి తీసుకున్నందుకు అరదండాలేయిస్తాను '' అన్నాను. వెంటనే స్త్రీకూలీ "జబ్బు పడ్డాకాణ్ణుంచీ ఆడివేళ్లు చీపురుముళ్లు, రేషన్‌తిండి వచ్చినప్పటి నుంచి నా వేళ్లు తుమ్మముళ్ళు. ఇద్దరం కంపతొడుగుల మైపోతున్నాం, పోనీ మహరాజులికి సరిపడి తమరిదై తే తమ కాడుంచేసుకోండి '' అంది. నేను దానిబెట్టుసరి వూసుకు ఆ వుంగరం తిరిగి తీసుకుని తిట్టి పొమ్మందాం అని అనుకున్నాను గాని,—ఆ వుంగరం నా వేళ్ళకూ వదులై, ఎవర్నడిగినా ఎవరిదో వెనకటియుగాల వాళ్ళదిగా చెప్పవలసి వచ్చేటట్టగపించింది.

ఒకలి ప్తయోజించి "మీ దై తే మీ రుచ్చుకోండి '' అన్నాను. "బలే మోసం చేశారయ్యోరు !" అన్నాడు మగకూలీ, ఆ లోహపుటుంగరాన్ని ఆడదానికందిస్తూ.

ఆడది ఆ వుంగరాన్ని కొంగున గట్టుకొంటూ "బలే మ్యాజిక్ చేశారయ్యోరు '' అంది ఏదోపోయిన మోహము తిరిగి సంపాదించుకున్నదానిలాగు కనిపించింది. వొట్టిదోసిట నంజలి పట్టింది బహుమానమన్నట్టు.

నా జేబులోనున్న రెండుఅణాకాసులు ఆలా దానిదోసిట్లో పడేస్తూ తలపోశాను. "ఆ దంపతులే దొంగలో ? నేనే దొంగనో ?"

.... .... .... .... ....